క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో మండలంలోని జగన్నాథగిరి వద్ద మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ రామారావుపేటకు చెందిన మీసాల సుబ్రహ్మణ్యం తన మోటారు బైక్‌పై ద్రాక్షారామ వెళుతున్నారు. జగన్నాథగిరి కెనాల్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన పంటకాలువలోకి బైక్‌తో సహా పల్టీలు కొట్టాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్స నిమితం కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కాజులూరు: గ్రామాలలో మద్యం మత్తులో యువత అసాంఘిక కార్యకలాపాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ రూరల్ సీఐ కృష్ణచైతన్య అన్నారు. మంగళ వారం మండలంలోని పలు గ్రామాలలో పర్య టించి శివరాత్రిని పురస్కరించుకుని నిర్వాహక కమిటీలు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మెహర్‌బాబా జయంతి వేడుకలు

కపిలేశ్వరపురం: అంగరలో మంగళవారం మెహర్‌బాబా 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మందిరంలో బాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

పది విద్యార్థులకు పెన్నుల అందజేత

మండపేట: పదో తరగతి విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గెడా శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సరస్వతీ పూజలో ఉంచిన పెన్ను లను పంపిణీ చేశారు.

నేడు వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటే శ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు మంగళ వారం తెలిపారు. ఆలయ అర్చక బృందం సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామికి పంచామృతాభిషేకం చేయను న్నామని తెలిపారు.

భీమేశ్వరా.. పాహిమాం..

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయిన ద్రాక్షారామ భీమేశ్వరాలయం
- ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- దర్శనానికి ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- పోటెత్తనున్న భక్తజనం



ద్రాక్షారామ ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు



కోటిపల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయం

రామచంద్రపురం రూరల్: పంచారామాలలో ఒక టిగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా భాసిల్లుతున్న భూ కై లాసం ద్రాక్షారామంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి దేవాలయం నేటి మహా శివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. మహా శివ రాత్రి పర్వదినాన ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని దర్శిస్తే సర్వ పాపాలు హరించి కోర్కెలు నెరవేర తాయని శివ భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనితో తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. ఆలయంలో తెల్లవారు జామున 2.30 గంటలకు సప్త గోదావరి నుంచి తీర్థపు బిందె తీసువచ్చి సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చన, బాలభోగం నిర్వహిస్తారు. 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్త నదుల జలాలు, ద్రాక్షా రామ పరిసరాల్లోని 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఏకాదశ రుద్రహోమం, పూజలు నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజలు జరుగుతాయి. రాత్రి 11.30 గంట లకు స్వామికి రాజభోగం సమర్పిస్తారు. అప్పటి నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనానికి విరామం ఇస్తారు. తిరిగి 12 గంటల నుంచి రాత్రి 1.30 గంటల వరకు స్వామివారి లింగోద్భవ దర్శ నానికి అనుమతిస్తారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుం డా ఏర్పాట్లు పూర్తి చేశారు.

మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కొబ్బరి ఆకులతో చలువ పందిళ్లు వేశారు. కూల ర్‌లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర, చక్ర పొంగలి, బిస్కెట్లు పంపిణీ చేసేందుకు సేవాదళ్‌ను సిద్ధం చేశారు. మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు శివరాత్రి జాగారం చేయడానికి ద్రాక్షారామ పైడా వెంకట రామకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ సం గీత విభావరి ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం మంగళ వారం పీవీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కె.గంగవరం: మహా శివరాత్రి సందర్భంగా సోమేశ్వ రస్వామి ఆలయం ముస్తాబైంది. ద్రాక్షారామ భీమే శ్వరస్వామితో పాటు కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గ్రామంలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద సందడి నెలకొంది. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు లక్షన్నర మంది భక్తులు కోటిపల్లికి పయనవుతారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాజమండ్రి, రావులపాలెం, యానం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కోటిప ల్లి గ్రామానికి ఆర్టీసీ సుమారు 50 బస్సులు అదనం గా నడపనుంది. క్యూలైన్ల వద్ద భక్తుల కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. గౌతమీ గోదావరి పుష్కరఘాట్ వద్ద భారీ బందోబస్తు మధ్య పుణ్య స్నానాలు ఆచరించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.



ద్రాక్షారామలో కొలువైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి(ఫైల్)

వీఐపీ దర్శనం రద్దు

ఈ ఏడాది కూడా వీఐపీ దర్శనం రద్దు చేశారు. పుణ్య స్నానాల అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించు కునేందుకు మూడు రకాల దర్శనాలు ఏర్పాటు చేశారు. స్వామివారిని దగ్గరగా దర్శించుకునేందుకు శీఘ్ర దర్శనానికి రూ.100, ప్రత్యేక దర్శనానికి రూ.50, ఉచితం దర్శనం ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పలు స్వచ్ఛంద సం స్థలు ఆతిథ్యాన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో నిత్యాన్నదాన పైడాసత్రం, సత్యసాయి సేవాసంస్థలు, కమ్మ సంఘం, ఆర్యవైశ్య సంఘం, వెల్ల గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ, మానస ట్రస్ట్, బ్రహ్మసం ఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమాలు నిర్వహించనున్నారు.

ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద సుమారు వంద సంవత్సరాల నుంచి ఏటా రథో త్సవం నిర్వహించేవారు. అయితే గత కొన్ని సంవ త్సరాల క్రితం నుంచి రథోత్సవం నిర్వహించడం మానేశారు. రెండేళ్ల నుంచి భక్తులు సమకూర్చిన రథంలో స్వామివారిని రథంపై కోటిపల్లి పురవీ ధుల్లో ఊరేగించారు.

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలలో బుధ వారం శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేం దుకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని గొల్లపాలెం, కాజు లూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కొలం క, జగన్నాథగిరి గ్రామాల్లో శివాలయాలు ఉన్నాయి. పరిసర గ్రామాల నుంచి శివాలయాలకు వచ్చేవారికి ఇబ్బందులు కలుగకుండా తగు వసతులు సమకూర్చి నట్టు నిర్వాహక కమిటీల సభ్యులు తెలిపారు.



శివాలయం ఎదురుగా సరస్సులో విద్యుద్దీపాలంకరణలో అలరారుతున్న మహాశివుడు

శివాలయాలు శోభాయమానం

రాయవరం: మహా శివరాత్రి ఉత్సవాన్ని శైవ క్షేత్రాల్లో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. హరహర మహాదేవ శంభో శంకర అంటూ.. అంటూ భక్తులు శివ నామస్మరణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవాలయాలను ఉత్సవ కమిటీలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దు తున్నాయి. విద్యుద్దీపాలంకరణ చేయడంతో నయ నానందకరంగా శోభిల్లుతున్నాయి. రాయవరం మండలం సోమేశ్వరంలో వేంచేసి యున్న బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంక రణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.



ఉత్సవాలకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

ఓటు భద్రమేనా.. చూసుకోండిలా..

- ఎక్కడ ఉన్నా వెబ్‌సైట్‌లో వీక్షించే వెసులుబాటు
- బ్యాలెట్ పేపరుతోనే పట్టభద్రుల ఎన్నికలు
- క్లస్టర్ పరిధిలో 14,925 మంది ఓటర్లు

రాయవరం: ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తు న్నారు. ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 14,925 మంది ఓటు వేసే పట్టభద్రులు ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు వేలాది మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇప్పటికే అధికారులు ఎన్నికలకు సం బంధించి పోలింగ్ బూత్‌ల పరిశీలన చేశారు.

27న పోలింగ్

ఈ నెల 27న ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. ఇప్పటికే పీవో, ఏపీవోల నియామకం చేపట్టిన జిల్లా యంత్రాం గం వారికి శిక్షణనిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓటర్ల జాబితాతో సంబంధం లేకుండా గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ ఓటర్ల జాబితాను రూపొందించారు. రామచంద్ర పురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో 14,925 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లలో అధిక సంఖ్యాకులు రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారు. వారంతా ఏ మేరకు ఓటు హక్కు విని యోగించుకుంటారో వేచి చూడాలి.



రాయవరం మండలంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రామచంద్రపురం ఆర్డీవో

ఓటరు జాబితాలో చూసుకోండిలా..

గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో చూసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిం ది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉన్నత చదువులు చదువుతున్న ఓటర్లు జాబితాలో వారి పేరు ఉందో.. లేదో తెలుసుకునే అవకాశముంది. జాబితాలో ఓటు ఉంటే ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో.. ఏ బూత్‌లో ఉందో తెలుసుకునే వీలుంది. ఏపీ ఎన్నికల వెబ్‌సైట్‌లో సీఈవో.ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ లాగిన్‌లోకి ఎంటర్ అవ్వడం ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు. వెబ్ పేజీ ఓపెన్ చేయగానే కుడివైపు 'ఎమ్మెల్సీ రిజి స్ట్రేషన్ 2024' ఉంటుం ది. దాన్ని క్లిక్ చేయగానే నాలుగు ఆప్షన్స్ కన్పిస్తాయి. చివరి ఆప్షన్ సెర్చ్ యువర్ నేమ్‌ను క్లిక్ చేయగానే పట్ట భద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వివరాలతో కూడిన పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకోవాలి. ఓటు నమోదు చేసుకున్నప్పుడు వచ్చిన ఐడీ, పేరు, డోర్ నంబరు నమోదు చేసి తెలుసుకో వచ్చు. డోర్ నంబరు క్లిక్ చేస్తే ఆ నంబరుతో ఎన్ని ఓట్లు ఉన్నాయో వివరాలు వస్తాయి. దానిపై క్లిక్ చేస్తే దరఖాస్తు నంబరు, పేరు, వయస్సు, పోలింగ్ బూత్ నంబరు, ఓటు సీరియల్ నంబరుతో పాటు ఏ కేంద్రం లో, ఏ గదిలో ఓటు వేయాలో తెలుసుకునే వీలును ఎన్నికల కమిషన్ కల్పించింది.

పురుష ఓటర్లే అధికం

గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను పరిశీలిస్తే పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. సాధారణ ఎన్ని కల్లో రెండు నియోజకవర్గాల పరిధిలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, పురుష ఓటర్లు తక్కువగా ఉన్నారు. గ్రాడ్యుయేషన్ ఓటర్లు దీనికి భిన్నంగా ఉం డడం గమనార్హం. మండపేట నియోజకవర్గంలో 13 పోలింగ్ బూత్‌ల్లో 4,518 మంది పురుష ఓటర్లు, 2,980 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రామచంద్ర పురం నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో 10 పోలింగ్ బూత్‌లు ఉండగా 4,634 మంది పురుషులు, 2,793 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

క్లస్టర్ పరిధిలో ఓటర్లు, పోలింగ్ బూత్‌ల సంఖ్య ఇలా

మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
రాయవరం	02	1,196	667	1,863
మండపేట	08	2,295	1,711	4,006
కపిలేశ్వరపురం	03	1,027	602	1,629
రామచంద్రపురం	07	3,282	2,110	5,392
కె.గంగవరం	03	1,352	683	2,035

నీటి సరఫరా సమస్యను పరిష్కరించండి



స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన రక్షిత మంచినీటిని అం దించేందుకు వెల్ల రక్షిత మంచినీటి ప్రాజెక్టు వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని మున్సిపల్ చైర్‌ప ర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. రక్షిత మంచినీటి సరఫరాలో పట్టణ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు చైర్‌పర్సన్ శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళ వారం కౌన్సిల్ సభ్యులంతా వెల్ల రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో కలుషిత నీరు వస్తోందని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు కౌన్సిల్ సభ్యులతో వెళ్లి నిర్వహణ తీరును పరిశీలించి నట్లు చెప్పారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన రక్షిత మంచినీటిని అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పురపాలక సంఘ కార్యాలయంలో గల కౌన్సిల్ హాల్ నందు సాధా రణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది.

ఉయ్యాల జంపాల దైవక్షేత్రంలో కల్యాణ పూజలు

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవక్షేత్రంలో త్రయం బకేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి కల్యాణ పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సం ఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. కొమార్లపల్లి సత్యనారాయణమూర్తి, ప్రభాకర శర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కొమార్లపల్లి సత్య సుబ్రహ్మణ్యం ఆధ్వ ర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

మండపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొం టుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. స్వచ్ఛ మండపేట సాధనలో భాగంగా ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. 30వ వార్డు సంఘంకాలనీ, సత్యశ్రీ రోడ్డు, గాంధీనగర్, ఆనంద్ నగర్ వీధుల్లో మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆర్పీలతో పర్యటించి శుభ్రతపై అవగా హన కల్పించారు. మున్సిపల్ ఏఈలు ఆంజనేయులు, పవన్‌కుమార్, ఇన్ చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, శానిటేషన్, సచివాలయ వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

రుద్రయ్య చౌదరికి ఘన నివాళి




శేషారెడ్డికి పురస్కారాన్ని అందిస్తున్న జీవీరావు తదితరులు

రామచంద్రపురం: ప్రముఖ విద్యావేత్త డాక్టర్ గరిగిపాటి రుద్రయ్య చౌదరి వర్ధంతిని మంగళవారం స్థానిక మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి రుద్రయ్య చౌదరి శిష్యుడు, ప్రముఖ విద్యావేత్త, ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోడరన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ చెలికాని స్టాలిన్, నాయకులు గరికపాటి సూర్యనారాయణమూర్తి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. రుద్రయ్య చౌదరి గౌరవార్థం మోడరన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జీవీరావు ఆధ్వర్యంలో ముఖ్య అతిథి నల్లమిల్లి శేషారెడ్డికి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త జె.దుర్గాప్రసాద్, డాక్టర్ సి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అల్లదిగో.. ఆదియోగి..

- ద్వారపూడిలో ఆదియోగి విగ్రహం ఏర్పాటు
- దేశంలోనే మూడో అతిపెద్ద విగ్రహంగా అవతరణ
- నేడు ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన ఆదియోగి విగ్రహం

మండపేట: పవిత్ర గోదావరి నదీ తీరాన ఎన్నో పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. మాండవ్య మహాముని తపస్సు చేసిన మండపేట ప్రాంతంలో సుప్రసిద్ధ దేవా లయాలు, ప్రాచీన దేవాల యాలు పురాణ ప్రసిద్ధి కెక్కాయి. ముఖ్యంగా ఆం ధ్రా శబరిమలైగా పేరు గాంచి వస్త్ర వ్యాపారాలకు రాజధానిగా శోభిల్లుతున్న ద్వారపూడి గ్రామంలో భారతదేశంలో మూడో అతిపెద్ద ఆదియోగి విగ్రహం నేడు మహా శివరాత్రి పర్వదినం సంద ర్భంగా ఆవిష్కరణ కానుంది. 60 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఆదియోగి విగ్రహం వెనుక భాగంలో ప్రవేశ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి భక్తులు ధ్యానం చేసుకునేం దుకు వీలుగా ఏర్పాటు చేశారు.



వ్యవస్థాపకులు కనకరాజు

ఆధ్యాత్మిక కేంద్రంగా ద్వారపూడి : ద్వారపూడి గ్రామాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుతామని ఆలయ వ్యవస్థాకులు, గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు తెలిపారు. ఆదియోగి విగ్రహానికి ఎదురుగా వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలను తమ తండ్రికి నమస్కరిస్తున్నట్టుగా ఏర్పాటు చేశా మన్నారు. విగ్రహానికి నాలుగు వైపులా సప్త ఋషులు, వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేసి ధ్యాన ముద్రలో ఉన్నట్లు తయారు చేయడం జరిగిందన్నారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, కుమారస్వామి, అర్ధనా రీశ్వరుడు, నటరాజ విగ్రహం, కృష్ణార్జునులు, అనంత పద్మనాభస్వామి, నంది విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. తాను కొద్ది కాలం క్రితం కర్ణాటకలోని చిక్ బల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహాన్ని దర్శించానని ఆ సమయం లో పరమ శివుని ప్రేరణతో అయ్యప్ప ఆలయంలో సైతం ఆదియోగిని ప్రతిష్ఠిం చాలనే భావన కలిగిందని చెప్పారు. కొమరిపాలేనికి చెందిన శిల్పి కొల్లి వీర్రా ఘవతో చర్చించి విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఏడాది పాటు శ్రమించి సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఈ విగ్రహాన్ని నిర్మించామన్నారు.